సాక్షి
ఖమ్మం
బుధవారం, 20, డిసెంబర్, 2023



గోటి తలంబ్రాల పంట..

భద్రాద్రి రామయ్య కల్యాణంలో వినియోగించే గోటి తలంబ్రాల కోసం చింతకాని మండలం జగన్నాథపురంలో భక్తులు వరి సాగు చేశారు. 8లో



నడిచివెళ్లి చదువుకున్నా..

డాక్టర్ కావాలనే లక్ష్యంతో దూర ప్రాంతంలోని పాఠశాలకు నడిచివెళ్లి చదువుకున్నానని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి తెలిపారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
28° / 16°

బుధవారం పగటి పూట కూడా జిల్లాలో చలిగాలులు వీస్తాయి. సాయంత్రం తర్వాత చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఇలా అయితే ఎలా?

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సిటీ స్కాన్ సేవలు అందుబాటులోకి రావడంతో పేదలకు లబ్ధి జరుగుతున్నా... రాను రాను రోగుల తాకిడి పెరగడంతో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రూ.కోట్లు ఖర్చు పెట్టి యంత్రాన్ని కేటాయించిన అధికారులు.. అవసరమైన మేరకు టెక్నీషియన్లను మాత్రం నియమించలేదు. దీంతో ఆశించిన మేరకు సేవలు అందడం లేదు.

– ఖమ్మంవైద్యవిభాగం

పెద్దాస్పత్రిలో సీటీ స్కాన్ సేవలకు అంతరాయం

- ఒకే టెక్నీషియన్‌తో తప్పని తిప్పలు
- రాత్రి వేళ అత్యవసరమైతే మళ్లీ ప్రైవేట్‌కే..
- మూడేళ్లలో 12,820 మందికి సేవలు

2021లో ప్రారంభం

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి 2021 ఆగస్టులో అత్యాధునిక సీటీ స్కాన్ యంత్రాన్ని కేటాయించారు. రూ.2కోట్ల విలువైన ఈ యంత్రాన్ని అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. దీంతో సీటీ స్కాన్ అవసరమైన వారు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సిన బాధ తప్పినట్లేనని అంతా భావించారు. కానీ ఒకే టెక్నీషియన్‌ను నియమించడంతో పూర్తి స్థాయిలో సేవలందడం లేదు. ఒక్కరే అన్ని షిఫ్టుల్లో డ్యూటీ చేయటం సాధ్యం కాకపోగా... రాత్రివేళ సేవలు అందుబాటులో ఉండడం లేదు. ఫలితంగా అదే టెక్నీషియన్‌ను ఫోన్ చేసి పిలిపించడం లేదంటే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లడమో షరామామూలుగా మారింది.

ఆలస్యమైతే అంతే...

రాత్రి సమయాన ప్రమాదాల బారిన పడిన వారు, ఇతర అత్యవసర చికిత్స అవసరమైన వారికి స్కానింగ్ చేయడం తప్పనిసరి. ఆ నివేదిక ఆధారంగానే వైద్యులు చికిత్స మొదలుపెడతారు. కానీ రాత్రి వేళ టెక్నీషియన్ అందుబాటులో ఉండక ఫోన్ చేసి పిలిపించాల్సి వస్తోంది. సదరు టెక్నీషియన్ వచ్చేలోగా విలువైన సమయం వృథా అయి బాధిత కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. కొందరి విషయంలో చికిత్స ఆలస్యమైతే ప్రాణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం కూడా ఉందని చెబుతున్నారు.

మరో ఇద్దరు ఉంటేనే ప్రయోజనం

ఒకరికి సిటీ స్కాన్ తీయాలంటే సుమారు 20 నిమిషాల సమయం పడుతుంది. స్కాన్ తీసిన తర్వాత ఆన్‌లైన్‌లో నివేదిక సిద్ధం చేసేందుకు మరో పది నిమిషాలు కలిపి మొత్తంగా అర గంట సమయం వెచ్చించాల్సిందే. కానీ ఒక్కరే టెక్నీషియన్ అటు స్కానింగ్ చేసి, ఇటు నివేదిక తయారుచేయాల్సి రావడంతో స్కానింగ్ గది వద్ద ఎప్పుడు చూసినా జనం బారులుదీరి కనిపిస్తున్నారు. మూడు షిఫ్టులకు గాను ఒక్కో టెక్నీషియన్ ఉంటే పని సులువు కావడంతో పాటు ఎదురుచూసే బాధ తప్పుతుందని, ఎక్కువ సంఖ్యలో స్కానింగ్‌లు తీయడం సాధ్యమవుతుందని అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

2021	2022	2023	ఇప్పటివరకు అందించిన సేవలు
1,771	5,144	5,805	

ఇబ్బందులు నిజమే..



సిటీ స్కాన్‌లో ఒక్కరే టెక్నీషియన్ ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే. రోగులు పెరుగుతుండడంతో ఒత్తిడి పెరుగుతోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతి రాగానే టెక్నీషియన్లను నియమిస్తాం.

– డాక్టర్ బి.కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్



సీటీ స్కాన్ చేస్తున్న టెక్నీషియన్

రాత్రి వేళ అంతరాయం

సిటీ స్కాన్ పెద్దాస్పత్రిలో ఎక్కువ మందికి అవసరం పడుతుంది. నిత్యం ఇక్కడ 20 నుండి 30 మందికి స్కానింగ్ చేస్తుండగా, చాలా ఆలస్యమవుతోంది. ఇక రాత్రివేళ ప్రమాదకేసులు, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వారిని తీసుకొస్తే టెక్నీషియన్ అందుబాటులో లేక చికిత్సలో జాప్యం జరుగుతోంది. ఈమేరకుమరో ఇద్దరు టెక్నీషియన్లు తక్షణమే నియమిస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

న్యూస్‌రీల్

'మహాలక్ష్మి'కి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

- ఆర్‌టీసీ ఆర్‌ఎం వెంకన్న



కొత్తగూడెంలో ఆర్టీసీ బంక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం, అధికారులు

చుంచుపల్లి: మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న ఆదేశించారు. కొత్తగూడెంలో మంగళవారం ఆయన కొత్తగూడెం, మణుగూరు డిపో మేనేజర్లు బానాల వెంకటేశ్వరరావు, స్వామితో సమావేశమై మాట్లాడారు. జీరో టికెట్ విషయంలో సంస్థ ఆదేశాల ప్రకారం వ్యవహరించాలని, మహిళలకు ఎదురవుతున్న ఇబ్బందులపై అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా ప్రయాణికులకు తగినట్లు బస్సులు సరిపోకపోతే అప్పటికప్పుడు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే, ఉచితంగా ప్రయాణిస్తున్నారనే భావన విడనాడి మహిళలతో సిబ్బంది మర్యాదతో వ్యవహరించాలని చెప్పారు. అంతేకాకుండా అద్దె బస్సుల నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం కొత్తగూడెంలోని ఆర్టీసీ పెట్రోల్ బంక్‌ను ఆర్‌ఎం పరిశీలించి నిర్వహణపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఎంలతో పాటు అద్దె బస్సుల యజమానులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అసిస్టెంట్ కలెక్టర్ తనిఖీ



ఉద్యోగులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్

తల్లాడ: తల్లాడ మండలంలోని నారాయణపురం, తల్లాడ, గాంధీనగర్‌తండా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని వసతులను పరిశీలించిన ఆయన విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. అలాగే, లబ్ధిదారులకు పోషకాహారాన్ని క్రమం తప్పకుండా పంపిణీ చేయాలని తెలిపారు. తల్లాడ ఎంపీడీఓ కొండపల్లి శ్రీదేవి, ఉద్యోగులు పాల్గొన్నారు.

87,819 మంది ఖాతాల్లో 'రైతుబంధు'

ఖమ్మంవ్యవసాయం: యాసంగి పెట్టుబడి సాయంగా రైతుబంధు ద్వారా జిల్లాలో మంగళవారం నాటికి 87,819 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ అయిందని అధికారులు వెల్లడించారు. జిల్లాలో 3,42,799 మంది రైతులను అర్హులుగా గుర్తించిన ప్రభుత్వం రూ.370.29 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నెల 12వ తేదీ నుంచి పెట్టుబడి సాయం అందుతుండగా, మంగళవారం వరకు రూ.21.87కోట్లు జమ చేశారు. అయితే, జిల్లాలో ఎకరం లోపు భూమి కలిగిన రైతులు 1.20 లక్షల మంది ఉండగా, ఇప్పటివరకు వీరికే పెట్టుబడి సాయం జమ అవుతోంది. కొన్ని ప్రాంతాల్లో యాసంగి పనులు మొదలుకావడంతో మిగతా రైతులు ఎదురుచూస్తున్నారు.

నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో 30 కేంద్రాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బుధవారం నుంచి డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. ఈమేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20, 22, 27, 29, జనవరి 2, 4, 8, 10, 12వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21, 23, 28, 30, జనవరి 3, 5, 9, 11, 16, 18వ తేదీల్లో, ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20, 22, 27, 29, జనవరి 2, 4, 8, 10, 12, 17, 19, 20, 22, 23, 24వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. కాగా, ఆన్‌లైన్‌లో పంపించే ప్రశ్నపత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. మూడు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 1,83,942మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. మొత్తం 122 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 30 సెంటర్లు ఉన్నాయి.

కొనుగోళ్లు వేగవంతం చేయండి

- ఇప్పటివరకు 18,505 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- కలెక్టర్ వీ.పీ.గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగంగా చేపట్టాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో 231 కేంద్రాలకు గాను 226 ప్రారంభించగా, ఇప్పటి వరకు 18,505.160 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి సీఎంఆర్ రికార్డులు పరిశీలించాలని తెలిపారు. అలాగే, అధికారులు క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించి వేగంగా పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, డీఏఓ విజయనిర్మల, జిల్లా సహకార అధికారి విజయకుమారి, డీఎస్ఓ శ్రీలత, ఏఎంటీ నర్సింహారావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం, ఏపీడీ జయశ్రీ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

రబీలో సాగు చేయాల్సిన పంటలు, మెళకువలపై రైతులకు అవగాహన కల్పించి మెరుగైన ఫలితాలు సాధించేలా వ్యవసాయ శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమై మాట్లాడారు. మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్ష ఫలితాల కార్డుల అందజేత, పంటల నమోదుపై సూచనలు చేసి లక్ష్యం మేరకు పామాయిల్ మొక్కలు నాటేలా పర్యవేక్షించాలని తెలిపారు. డీఏఓ విజయనిర్మల, ఏడీఏ సరిత, శ్రీనివాస్‌రెడ్డి, ఏడీ అనిత తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వీ.వీ.పాలెంలో పంట భూములను పరిశీలిస్తున్న అధికారులు

కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి రావిష్ ప్రసాద్

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తూనే, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హుల దరికి చేర్చేలా కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి రావిష్ ప్రసాద్ సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా మంగళవారం ఆయన జిల్లా అధికారులతో కలిసి రఘునాథపాలెం మండలంలో పర్యటించారు. మండలంలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో పర్యటించగా... కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రావిష్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలను అమలుచేస్తోందని, వీటిపై అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పంట పొలాల్లో డ్రోన్ల ద్వారా మందుల పిచికారీని పరిశీలించారు. అతర్వాత కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన రావిష్‌ప్రసాద్ మాట్లాడుతూ పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులకు అందించడంలో అధికారులు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఏఓ విజయనిర్మల, డీఆర్‌డీఓ విద్యాచందన, డీఎంహెచ్ఓ మాలతి, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ రావెళ్ల మాధవితో పాటు యడగర్ల హన్మంతరావు, శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, పద్మయ్యనాయుడు, శారద, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలయం!



రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన గ్రంథాలయ భవనం

- వైట్‌హౌస్‌ను తలదన్నేలా డిజిటల్ లైబ్రరీ
- సత్తుపల్లిలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మాణం
- సొంత నిధులు వెచ్చించిన ఎంపీ బండి పార్థసారథిరెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న పుస్తకాభిమానులు, విద్యార్థులు

సత్తుపల్లి: ప్రజలు, విద్యార్థులతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అండగా నిలిచేలా రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి అత్యాధునిక వసతులతో డిజిటల్ లైబ్రరీని నిర్మించారు. ఆయన సొంత నిధులు రూ.2కోట్లు వెచ్చించి సత్తుపల్లి బస్టాండ్ సమీపాన గ్రంథాలయాన్ని నిర్మించగా ఇటీవలే ప్రారంభించారు. అమెరికాలోని వైట్ హౌస్‌ను తలపించేలా ఆధునిక సదుపాయాలతో దీన్ని నిర్మించగా.. సత్తుపల్లి ప్రజల కల సాకారమైనట్లయింది.

దూర ప్రాంతాలకు వెళ్లకుండా..

నియోజకవర్గ కేంద్రమైన సత్తుపల్లి విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఇంటర్, డిగ్రీ, బీఈడీ, నర్సింగ్, ఇంజనీరింగ్ విద్యార్థులు వేలాది మంది చదువుతుండగా, ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరిలో స్థోమత ఉన్న వారు హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు శిక్షణ కోసం వెళ్తుండగా మిగతా వారు దూరప్రాంతాలకు వెళ్లలేక, స్థానికంగా సిద్ధమయ్యే అవకాశాలు లేక చదువుకు దూరమవుతున్నారు. సత్తుపల్లిలో శాఖా గ్రంథాలయం ఉన్నా అరకొర వసతులు, తక్కువ సంఖ్యలో పుస్తకాలతో స్థానికుల అవసరాలను తీర్చలేకపోతోంది. దీన్ని గమనించిన ఎంపీ పార్థసారధిరెడ్డి గ్రంథాలయాన్ని నిర్మించగా ఉద్యోగార్థులకు మేలు జరగనుంది.



గ్రంథాలయంలోని పుస్తకాలు



పచ్చదనంతో ఆహ్లాదం

అన్ని వసతులతో...

సుమారు పది కుంటల స్థలంలో నిర్మించిన డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి లైబ్రరీ వైట్‌హౌస్‌ను తలదన్నేలా కనిపిస్తోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో పిల్లల విభాగం, విశాలమైన రీడింగ్‌హాల్, కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు రీడింగ్‌హాల్, అభ్యర్థుల గ్రూప్ డిస్కషన్స్ కోసం కాన్ఫరెన్స్‌రూం, డిజిటల్ లైబ్రరీ ఉన్నాయి. అన్ని వయస్సుల వారికి ఉపయోగపడే విధంగా పుస్తకాలను అందుబాటులో ఉంచటంతో పాటు సుందరంగా తీర్చిదిద్దారు. ఇక తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఒకేసారి వంద మంది కూర్చుని చదువుకునేలా హాళ్లు ఉండగా... వాహనాల పార్కింగ్ కోసం విశాలమైన స్థలాన్ని కేటాయించారు. ఆవరణలో పచ్చిక బయళ్లతో ఈ లైబ్రరీ ఆకట్టుకుంటోంది.

అంతర్జాతీయ స్థాయిలో..



నేను చదువుకున్న ప్రాంత విద్యార్థుల కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన డిజిటల్ లైబ్రరీని అందుబాటులోకి తీసుకొచ్చాం. ఇక్కడి పుస్తకాలు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడతాయి. విద్యార్థులు, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలి.

– బండి పార్థసారధిరెడ్డి, ఎంపీ

బహుళ ప్రయోజనాలు..



రూ.కోట్ల వ్యయంతో డిజిటల్ లైబ్రరీని కట్టించడం ఆనందంగా ఉంది. ఇందుకోసం ముందుకొచ్చిన పారిశ్రామిక వేత్త, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డికి అంతా రుణపడి ఉంటారు. వేలాది పుస్తకాలతో గ్రంథాలయం ఉన్నందున విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించవచ్చు.

– బి.మధుసూదన్‌రాజు, సాహితీవేత్త, సత్తుపల్లి

అన్ని పుస్తకాలు అందుబాటులో..



త్వరలో ఉద్యోగాల భర్తీకి రాత పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సిద్ధం కావాలంటే పుస్తకాలు మాత్రమే సరిపోవు. కానీ కొత్తగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీ మాలాంటి వారందరికీ ఉపయోగపడుతుంది. విలువైన గ్రంథాలయం మాకు చేరువవడం ఆనందంగా ఉంది.

– బి.గ్రీష్మ, విద్యార్థి, సత్తుపల్లి

మంచి సదుపాయాలు..



ఈ ప్రాంతంలో ఇంత మంచి లైబ్రరీ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. పిల్లలకు అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వందలాది మంది ఒకేసారి చదువుకునేందుకు హాళ్లు ఉన్నాయి. గ్రంథాలయంతో పిల్లలు, విద్యార్థుల్లో పుస్తక అభిరుచి పెరుగుతుంది.

– ఏ.రాంబాబు, ఉపాధ్యాయుడు, సత్తుపల్లి



గ్రంథాలయంలోని ఆర్వో ప్లాంట్

నిజరూపం.. పులకించిన భక్తజనం

- రామావతారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య
- కొనసాగుతున్న ముక్కోటి అధ్యయనోత్సవాలు

భద్రాచలంటౌన్ : కలియుగ వైకుంఠంగా ప్రసిద్ధిగాంచిన భద్రాద్రి క్షేత్రంలో కొలువైన జగదభిరాముడు మంగళవారం నిజరూపమైన రామావతారంలో దర్శనమిచ్చారు. ఈ రూపంలో స్వామివారిని తిలకించిన భక్తులు పులకించిపోయారు. శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ముందుగా దేవస్థాన వేద పండితులు స్వామివారిని బేడా మండపానికి తీసుకొచ్చి రామావతారంలో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలు, భక్తుల కోలాటాలు, రామ నామ స్మరణల నడుమ మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామివారిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసి నివేదన, హారతి చేశారు.

భారీగా హాజరైన భక్తులు దర్శించుకున్న తర్వాత స్వామివారిని తిరువీధి సేవకు తీసుకెళ్లారు. మిథిలా స్టేడియంలోని వేదిక వద్ద స్వామివారిని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఆలయ ఈఓ రమాదేవి, పట్టణ సీఐ నాగరాజు రెడ్డి దర్శించుకున్నారు.



నిజరూపంలో ఉన్న రామచంద్రస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

తెల్లచేపల ఉత్పత్తిపై మత్స్యకారులకు శిక్షణ

కూసుమంచి: కూసుమంచి మండలం పాలేరులోని శ్రీ పీవీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా స్థానంలో తెల్లచేపల పిల్లల ఉత్పత్తి, హేచరీ యాజమాన్యం అంశాలపై మత్స్యకారులకు శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు సాగే శిక్షణలో ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కొమురం భీం, కామారెడ్డి జిల్లాల మత్స్యకారులు పాల్గొన్నారు. ప్రారంభ సమావేశంలో పాలేరు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ చేపలకు మంచి డిమాండ్ ఉన్న నేపథ్యాన ఉత్పత్తి పెంచడం ద్వారా సామాన్యులకు కూడా పోషకాహారాన్ని అందుబాటులోకి తీసుకురావొచ్చని తెలిపారు. అనంతరం మత్స్య పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ పరిశోధనా స్థానంలో ఇప్పటి వరకు 3వేల మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. మత్స్య శాస్త్రవేత్త రవీందర్, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చేపల ఉత్పత్తి వివరాల బ్రోచర్లు విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఉషశ్రీ

రఘునాథపాలెం: రఘునాథపాలెం కేజీబీవీ విద్యార్థిని వై.ఉషశ్రీ రగ్బీ అండర్–14 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ లత మంగళవారం ఈ నెల 21నుంచి 27వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరుగుతున్న పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆమె పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉషశ్రీని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు


సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

సత్తుపల్లి: సింగరేణి యాజమాన్యం కనీస రక్షణ చర్యలు అమలు చేయడంలో విఫలం కావడంతోనే గనుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సీతారామయ్య ఆరోపించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో మంగళవారం జరిగిన ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగానే కాక నూతన ఉద్యోగాలు, భూగర్భగనుల సాధనకు పోరాడిన చరిత్ర విప్లవ కార్మిక సంఘాలకే ఉందన్నారు. ఈమేరకు గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమను గెలిపించాలని ఆయన కోరారు. ఈసమావేశంలో నాయకులు జి.నాగేశ్వరరావు, అనురాధ, కె.కృష్ణ, సంజీవరావు, విశ్వనాథం పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో చరిత్ర సబ్జెక్ట్ బోధించేందుకు గెస్ట్ లెక్చరర్‌ను నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఆసక్తి ఉన్న వారు బుధవారం దరఖాస్తు చేసుకుంటే, గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎన్ఈటీ/ఎస్ఎల్ఈటీ/ఎస్ఈటీ/పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, బోధనానుభవం ఉన్నవారికి వెయిటేజీ ఇస్తామని ఆయన తెలిపారు.

తల్లి సంరక్షణ విషయంలో ఘర్షణ

రఘునాథపాలెం: మండలంలోని చెరువు కొమ్ముతండాకు చెందిన అన్నదమ్ములు కృష్ణ, రవి తమ తల్లి సంరక్షణ విషయంలో మంగళవారం ఘర్షణ పడ్డారు. నెలకొకరు చొప్పున తల్లి పోషణ బాధ్యతలు చూస్తుండగా, ఇదే విషయమై గొడవ జరిగింది. ఈ ఘటనలో కృష్ణ భార్యకు గాయాలు కాగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం ఎస్ఐ కొండలరావు తెలిపారు.

పులి వచ్చిందని పుకార్లు

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలులో పలువురు రైతుల పొలాల్లో పులి సంచరించిందంటూ మంగళవారం ప్రచారం జరిగింది. పులి పాదముద్రలుగా భావిస్తున్న కొన్ని ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో కూసుమంచి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పరిశీలించి అవి పులి అడుగులు కావని తేల్చారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని, ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

తిరుమలాయపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) గ్రామానికి చెందిన జోరుక కవిత(26) తన భర్త యాదగిరితో కలిసి మోటార్‌సైకిల్‌పై ఈనెల 16న తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడులో తమ బంధువు ఇంట్లో జరిగిన కర్మకాండకు హాజరైంది. అదేరోజు సాయంత్రం తిరిగి వెళ్తుండగా బచ్చోడుతండా వద్ద రోడ్డుపై గుంత ఉండడంతో బండి పైనుండి కవిత కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,000	3,000
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	23,600	19,500
కొత్త మిర్చి	23,000	23,000
పత్తి	6,800	4,300

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,454

గోటి తలంబ్రాల పంట కోత

- భద్రాద్రి రామయ్య కల్యాణానికి సిద్ధమవుతున్న తలంబ్రాలు
- 'శ్రీ లక్ష్మీబాలాజీ' సమితి ఆధ్వర్యాన సాగు, కోత పూర్తి


గోటి తలంబ్రాల కోసం వరికోత కోస్తున్న సమితి సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణంలో వినియోగించే తలంబ్రాల కోసం సాగు చేసిన వరి పంటను ఖమ్మం శ్రీ లక్ష్మీ బాలాజీ సేవా సమితి సభ్యులు కోశారు. చింతకాని మండలం జగన్నాథపురానికి చెందిన రైతు బండి వెంకట్రావుకు చెందిన అర ఎకరం భూమిలో సేవా సమితి సభ్యులు తలంబ్రాల కోసం వరి సాగు చేశారు. ఈమేరకు ఇటీవల పంట కోయగా, నూర్పిడికి సిద్ధమవుతున్నారు. సుమారు రెండున్నర నుంచి మూడు క్వింటాళ్ల ధాన్యం రానుండగా, 1.55 క్వింటాళ్ల బియ్యాన్ని గోటితో వలిచే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించారు.

మూడేళ్లుగా కార్యక్రమం

భద్రాద్రిలో సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాల తయారీ కార్యక్రమాన్ని శ్రీ లక్ష్మీ బాలాజీ సేవా సమితి మూడేళ్లుగా నిర్వహిస్తోంది. ఇందులో ఖమ్మం పరిసర ప్రాంతాలతో పాటు విజయవాడ, గుంటూరు, పాల్వంచ ప్రాంతాలకు చెందిన 472 మంది సభ్యులు ఉన్నారు. వీరు పంట కోత పూర్తయ్యాక ధాన్యాన్ని తమ ప్రాంతాలకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజల అనంతరం గోటితో వలిచి తలంబ్రాలు సిద్ధం చేశారు. అనంతరం ఖమ్మంలోని పలు ఆలయాల్లో పూజలు నిర్వహించి ఊరేగింపుగా భద్రాచలం వెళ్లి ఆలయంలో తలంబ్రాలు సమర్పిస్తారు. శ్రీ లక్ష్మీబాలాజీ సేవా సమితి అధ్యక్షురాలు వడ్డే లక్ష్మి సారథ్యాన బాధ్యులు మామిళ్లపల్లి వెంకటరమణ, సోమోజు వెంకటేశ్వర్లు, ఏపూరి మురళి, కల్పన, రమ, శ్రీ లక్ష్మీ, కనకాచారి, వరలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు.

మహాకార్యంగా భావిస్తున్నాం..



శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవానికి గోటి తలంబ్రాల తయారీని మహాకార్యంగా భావిస్తున్నారు. మూడేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుండగా భక్తులు సహకరిస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు 93921 33166, 98661 54545 నంబర్లలో సంప్రదించవచ్చు.

– వడ్డే లక్ష్మి, శ్రీ లక్ష్మీబాలాజీ సేవా సమితి అధ్యక్షురాలు

విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గాలు ఎన్నిక


జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డితో నూతన కార్యవర్గాల ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ అనుబంధ 327 యూనియన్) ఖమ్మం టౌన్ డివిజన్, ఎంఆర్‌టీ డివిజన్ నూతన కార్యవర్గాలను మంగళవారం ఎన్నుకున్నారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మందపాటి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన కార్యవర్గాలను ప్రకటించారు. ఖమ్మం టౌన్ డివిజన్ అధ్యక్షుడిగా ఆర్.నాగేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా వల్లాల యుగంధర్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎస్.జయప్రకాష్, కోశాధికారిగా వి.మహేశ్ ఎన్నిక కాగా, ఎంఆర్‌టీ డివిజన్ అధ్యక్షుడిగా టి.మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా ఎస్.సాయిరాం, కోశాధికారిగా పి.ఝాన్సీలక్ష్మి ఎన్నికయ్యారు. అలాగే, కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకోగా, సంఘం జిల్లా కార్యదర్శి వి.సీతారామగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, కోశాధికారి సత్యనారాయణ, గాదె మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వంతో స్నేహ సంబంధాలు బలపర్చుకొని ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

'వన జీవి'ని కలిసిన ఫారెస్ట్ ట్రెయినీ ఆఫీసర్లు


రామయ్యతో అటవీ శాఖ ఉద్యోగులు

ఖమ్మంరూరల్: హైదరాబాద్ దూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న బీట్ ఆఫీసర్లు మంగళవారం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో పద్మశ్రీ వనజీవి రామయ్యను కలిశారు. ఈసందర్భంగా మొక్కల పెంపకంపై ఆయన ఆసక్తి, ఇప్పటి వరకు నాటిన వనాలు, అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామయ్య మాట్లాడుతూ అటవీ ఉద్యోగులకు మొక్కలతో అనుబంధం ఉంటుందని.. అడవులు అంతరించిపోకుండా కాపాడాల్సిన బాధ్యత నిర్వర్తించాలని కోరారు. అనంతరం రామయ్యను వారు సన్మానించగా, ఫారెస్ట్ అకాడమీ కోర్సు డైరెక్టర్ ఉమ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి.సురేష్‌కుమార్, బీట్ ఆఫీసర్ ఎం.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల పక్షాన నిలబడేది కమ్యూనిస్టులే..

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భాగం హేమంతరావు


స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న హేమంతరావు, నాయకులు

తిరుమలాయపాలెం: పేదల పక్షాన నిలబడి, వారి సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భాగం హేమంతరావు తెలిపారు. తిరుమలాయపాలెంలో మంగళవారం ఏర్పాటుచేసిన రావూరి బుచ్చిరామయ్య, ఆళ్ల సీతారామయ్య 48వ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ప్రజలకు పెద్ద దిక్కుగా ఉంటూ బుచ్చిరామయ్య, సీతారామయ్య అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కాగా, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించి, వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్లకు అప్పగించేందుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. ఈమేరకు ప్రజలు కేంద్రప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. అనంతరం సీపీఐ సీనియర్ నాయకులు మద్దినేని వీరభద్రం స్మారక స్థూపాన్ని ఆవిష్కరించగా, నాయకులు మహ్మద్ మౌలానా, బత్తుల రాధాకృష్ణ, రామకృష్ణ, దంతాల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక


శ్రీకర్

రఘునాథపాలెం: అండర్–16 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు(విజయ్ హజారే ట్రోఫీ) నగరానికి చెందని కోటగిరి శ్రీకర్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం శ్రీకర్ పదో తరగతి చదువుతుండగా, ఆయన తండ్రి శ్రీధర్ రఘునాథపాలెం సీఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా తరఫున పోటీల్లో పాల్గొన్న శ్రీకర్ ఫాస్ట్ బౌలర్‌గా ప్రతిభ కనబర్చడంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యాన జరిగే ప్రాథమిక శిక్షణకు హాజరయ్యాడు. రెండు నెలల శిక్షణ అనంతరం రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయగా, పంజాబ్‌లో జరిగే పోటీలకు జట్టుతోపాటు సోమవారం బయలుదేరాడు.

లోక్ అదాలత్‌కు సహకరించండి

ఖమ్మం లీగల్: ఈనెల 30న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సహకరించాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సూచించారు. ఖమ్మంలో మంగళవారం ఆయన పీపీలతో సమావేశమై మాట్లాడారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు ఎక్కువగా లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కృష్ణమోహన్, పీపీలు నరసయ్య, అనిల్, గంగామోహన్ తదితరులు పాల్గొన్నారు.

నడిచివెళ్లి చదువుకున్నా.. డాక్టర్ అయ్యా

- కష్టపడితేనే లక్ష్యసాధన సాధ్యం
- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి


ఎమ్మెల్యే రాగమయిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్: ఏడేళ్ల వయస్సులోనే డాక్టర్ కావాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, రవాణా సౌకర్యాలు, మధ్యాహ్న భోజన సదుపాయం లేకున్నా పాఠశాలకు నడిచి వెళ్లి చదువుకుని లక్ష్యాన్ని చేరుకున్నానని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. సత్తుపల్లి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను మంగళవారం సాయంత్రం తనిఖీ చేసిన ఆమె తరగతి గదులు, టాయిలెట్లు, తాగునీటి వసతి, విద్యార్థుల హాజరును పరిశీలించాక విద్యార్థులతో మాట్లాడారు. తొలుత తాను డాక్టర్ కావాలనే లక్ష్యాన్ని చేరుకున్నాక, పేదలకు సేవలందించేందుకు ప్రభుత్వ ఉద్యోగం సాధించానని తెలిపారు. అనంతరం అందరికీ సేవ చేసేందుకు ఎమ్మెల్యేగా గెలిచానని చెప్పారు. ఈమేరకు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే దశలో కష్టాలు ఎదురైనా అధిగమించాలని, తద్వారా భావిజీవితం ఆనందంగా గడపొచ్చని తెలిపారు. ఈసందర్భంగా హెచ్ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యాన ఎమ్మెల్యే రాగమయిని సన్మానించగా, మండల విద్యానోడల్ అధికారి నక్కా రాజేశ్వరరావు, మధుసూదనాచారి, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, నాయకులు గోలి శ్రీనివాసరెడ్డి, ఎం.డీ.కమల్‌పాషా, వంగరి రాకేష్, భరత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ టోర్నీ కబడ్డీ విజేత నల్లగొండ


కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఇంటర్ సర్కిల్ విద్యుత్ శాఖ ఉద్యోగుల క్రీడాపోటీలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. కబడ్డీ ఫైనల్స్‌లో నల్లగొండ, వరంగల్ సర్కిల్ జట్లు తలపడగా నల్లగొండ జట్టు విజేతగా నిలిచింది. వరంగల్, నిజామాబాద్ జట్లు రెండు, మూడో స్థానాలు దక్కించుకున్నాయి. అలాగే, లాన్ టెన్నిస్‌లో సెమీస్ పూర్తి కాగా, బుధవారం ఉదయం ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు జి.బాలునాయక్, జగన్నాథ్, అప్పారావు తెలిపారు.

కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

నేలకొండపల్లి: ప్రభుత్వాస్పత్రులపై నమ్మకంతో వచ్చే ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు సూచించారు. నేలకొండపల్లి సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించాక వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్యులు, ఉద్యోగులతో సమావేశమైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆస్పత్రిలో మార్చురీ భవననిర్మాణం పూర్తయినందున వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. తద్వారా ఖమ్మం ఆస్పత్రిపై భారం తగ్గుతుందని చెప్పారు. వైద్యాధికారి కె.రాజేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించడం లేదని ఆందోళన


ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

సత్తుపల్లిరూరల్: రెండు నెలలుగా వేతనాలు, ఎనిమిది నెలలుగా బోనస్ ఇవ్వటం లేదని ఆరోపిస్తూ సత్తుపల్లి జేవీఆర్ ఓసీ–2లోని ఓబీ కాంట్రాక్టు కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. పెట్రోల్ బాటిళ్లతో ఆందోళనలో పాల్గొన్న వారు నాలుగు రోజులుగా పనులు నిలిపివేసి ఆందోళన చేస్తున్నా కంపెనీ బాధ్యులు పట్టించుకోవటం లేదని వాపోయారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ–2 విస్తరణ పనుల్లో భాగంగా మట్టి వెలికితీత పనులను కాంట్రాక్టు సంస్థకు అప్పగించగా, నెలనెలా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. తొమ్మిది నెలలుగా పీఎఫ్, బోనస్ ఇవ్వడం లేదని, సరైన వసతులు కూడా కల్పించడం లేదని చెప్పారు. ఈసారి వేతనాలు ఇచ్చే వరకు పనుల్లోకి వెళ్లేది లేదని వారు స్పష్టం చేశారు.

పాత బస్టాండ్‌లో పోకిరీలకు అడ్డుకట్ట


పోలీస్ ఔట్ పోస్ట్ వద్ద ఉద్యోగులు


రద్దీగా ఉన్న బస్సు వద్ద పోలీసుల నిఘా

పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం పాత బస్టాండ్ నుంచి కొన్నాళ్ల బస్సుల రాకపోకలు మొదలుకాగా, నానాటికీ రద్దీ పెరుగుతోంది. దీన్ని ఆసరాగా చేసుకున్న పోకిరీలు బస్టాండ్‌ను అడ్డాగా చేసుకోవడంతో మహిళలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాస్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం బస్టాండ్‌లో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఉదయం 6నుండి రాత్రి 10గంటల వరకు రెండు షిఫ్టులుగా పోలీసు భద్రత అందుబాటులోకి రావడంతో పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు. అలాగే, మహాలక్ష్మి పథకంతో బస్సులు కిటకిటలాడుతుండడంతో సందట్లో సడేమియా అన్నట్లు జేబుదొంగలుగా తమ పని కానిచ్చేస్తున్నారు. ఈమేరకు పోలీస్ ఔట్‌పోస్ట్ అందుబాటులోకి రావడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వీఆర్ఏ ఆత్మహత్య


రామస్వామి (ఫైల్)

తిరుమలాయపాలెం: భార్యను కోల్పోయి ఒంటరిగా జీవిస్తున్న వ్యక్తి మానసిక వేదనతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కొక్కిరేణికి చెందిన గుంతేటి రామస్వామి(75) గ్రామ వీఆర్ఏగా పనిచేస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం ఆయన భార్య మృతి చెందినప్పటి నుంచి మానసికంగా కృంగిపోయాడు. ఈనేపథ్యాన పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబీకులు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రామస్వామి కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక తరలించకుండా కందకాలు

ముదిగొండ: మండలంలోని గంధసిరి, పెద్దమండవలో మున్నేరు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యాన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఇసుక రవాణా కోసం మున్నేరులోకి ట్రాక్టర్లు వెళ్లకుండా జేసీబీతో కందకాలు తవ్వించారు. అక్రమ రవాణా చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్, తహసీల్దార్ రామారావు, ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

తొమ్మిది ట్రాక్టర్లు స్వాధీనం

మండలంలోని మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను మైనింగ్ అధికారులు న్యూలక్ష్మీపురం వద్ద మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఏడీ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదని తెలిపారు. తనిఖీల్లో ఏజీ గంగాధర్, ఆర్ఐ రాజారెడ్డి పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే సమయాన చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం ప్రత్యేక సంచార కోర్టు ఇన్ చార్జ్ న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం ద్వారకానగర్‌కు చెందిన పేరసాని వెంకటేశ్వర్లు స్థానికుడైన ఓ వ్యక్తి వద్ద 2013లో రూ.12లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి 2015లో రూ.15లక్షలకు చెక్కు ఇవ్వగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తే సరిపడా నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. దీంతో ఫిర్యాది తన న్యాయవాది చింతనిప్పు వెంకట్ ద్వారా కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. విచారణ అనంతరం వెంకటేశ్వర్లుకు జైలుశిక్ష విధించడమేకాక నగదు చెల్లించాలని న్యాయమూర్తితీర్పు చెప్పారు. కాగా, మరో కేసులో ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన రేపాల సీతారామయ్యకు ప్రత్యేక సంచార కోర్టు ఇన్‌చార్జ్ న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత ఏడాది జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.4లక్షల చెల్లించాలని తీర్పు చెప్పారు.

బాలికపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు

ఖమ్మం లీగల్: తిరుమలాయపాలెం మండలానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి జీవితఖైదు విధిస్తూ ఖమ్మం పోక్సో కోర్టు–2 ఇన్‌చార్జ్ న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి తీర్పు చెప్పారు. ఈ ఘటనపై తిరుమలాయపాలెం పోలీసులు నిందితుడు గోపిపై కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేయగా విచారణ అనంతరం మంగళవారం తీర్పు వెలువరించారు. నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.50వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ పసుపులేటి శ్రీనివాస్ వాదించగా మోహన్‌రావు, భద్రాజీ, చిట్టిబాబు సహకరించారు.